## యాడికిలో చేనేత కార్మికులకు నేడు ఉచిత వైద్య శిబిరం



యాడికి, జులై 8 (అనంత ప్రభ)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళ మహోత్సవం సందర్భంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖ ఆధ్వర్యంలో గురువారం యాడికిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ జిల్లా అధికారి వరప్రసాద్ తెలిపారు. యాడికిలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉదయం నుంచి శిబిరం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ శిబిరంలో కంటి చూపు సమస్యలు, మోకాళ్ల నొప్పులు, శరీర నొప్పులు, చర్మవ్యాధులు, క్షయ, మహిళలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలపై నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల చేనేత కార్మికులు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా అధికారి వరప్రసాద్ విజ్ఞప్తి చేశారు

## అగాపే వృద్ధాశ్రమంలో అన్నదానం



యాడికి, జులై 8 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో వున్న అగాపే వృద్ధాశ్రమంలో జూటూరు ఇస్మాయిల్, రషీద దంపతుల కుమారుడు యూనుస్ పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉద్యోగరీత్యా లండన్‌లో నివసిస్తున్న యూనుస్ పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఏడాది వృద్ధుల ఆశీస్సులు పొందాలనే సంకల్పంతో ఆశ్రమంలో వృద్ధులు, నిరాశ్రయులకు అన్నదానం చేయడం విశేషం. అనంతరం ఆశ్రమ వ్యవస్థాపకులు బత్తల ప్రసాద్‌తో పాటు ఆశ్రమంలోని వృద్ధులు యూనుస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన ఇస్మాయిల్ కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖదిర్, సోయాబ్, షేక్ షావలి, బషీర్, శ్రీనివాసులు చంద్రశేఖర్ తో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## డెంగ్యూపై అవగాహన ర్యాలీ



యాడికి, జులై 8 (అనంత ప్రభ)

జిల్లా మలేరియా అధికారి డి ఓబులు ఆదేశాల మేరకు చుక్కలూరు 2 సచివాలయం పరిధిలోని గంగాదేవిపల్లెలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ లావణ్య, డాక్టర్ కీర్తి ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సభ్యులు అధికారి శ్రీనివాసులు బోదకాలు బాధితుడు లక్ష్మీనారాయణ రెడ్డికి ప్రభుత్వం అందించిన సహాయ సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించి, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత, ఫ్రైడే డ్రైడే పాటించడం ద్వారా డెంగ్యూ నివారణ సాధ్యమని ప్రజలకు వివరించారు. అలాగే జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికీ రక్తపూత పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సిబ్బంది, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు

## సచివాలయము 4 లో సదరం స్లాట్ బుకింగ్ సేవలు ప్రారంభం



యాడికి, జులై 8 (అనంత ప్రభ)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దివ్యాంగులకు సదరం స్లాట్ బుకింగ్ సేవలను సచివాలయాల ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా యాడికి సచివాలయం 4లో వెల్ఫేర్ అసిస్టెంట్ అలీమ్ బి బుధవారం సచివాలయానికి వచ్చిన దివ్యాంగులకు సదరం స్లాట్ బుకింగ్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సేవతో దివ్యాంగులు ఇకపై కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, స్థానిక సచివాలయంలోనే సులభంగా స్లాట్ బుక్ చేసుకునే అవకాశం కలిగిందని తెలిపారు. ఈ సేవలను అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## యాడికి పీహెచ్‌సీలో ఏబీహెచ్‌ఏ పైలట్ ప్రాజెక్టుపై గేట్స్ ఫౌండేషన్ బృందం సమీక్ష



యాడికి, జూలై 8 (అనంత ప్రభ)

జిల్లా కలెక్టర్ ఆనంద్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఈ. భ్రమరాంబ దేవి ఆదేశాల మేరకు యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమలవుతున్న ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ ఆధారిత ద్వారా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ పైలట్ ప్రాజెక్టును గేట్స్ ఫౌండేషన్, స్వస్తి ఫౌండేషన్ ప్రతినిధుల బృందం బుధవారం సమీక్షించింది. ఏబీహెచ్‌ఏ నమోదు, రోగుల వైద్య చరిత్రను డిజిటల్ రూపంలో నమోదు చేసే విధానాన్ని పరిశీలించిన బృందం, ఆశా కార్యకర్తలతో కలిసి క్షేత్రస్థాయిలో సేవల అమలును పరిశీలించింది. ప్రాజెక్టు పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసిన ప్రతినిధులు గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అమలు చేస్తున్న ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ పరమేశ్వర్, గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు అనూష్ సింగ్, సామ్, స్వస్తి ఫౌండేషన్ డాక్టర్ స్టెఫీ గ్రేసి, కె. శివకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## యాడికిలో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు





యాడికి, జులై 8 (అనంత ప్రభ)

మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా మంగళవారం యాడికిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి, పూలమాలలు వేసి ఘనంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన ప్రజానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, జలయజ్ఞం, ఇందిరమ్మ గృహాలు, రైతు సంక్షేమ పథకాలు వంటి అనేక ప్రజాహిత కార్యక్రమాలతో ఆయన ప్రజల గుండెల్లో చిర–స్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి కార్యకర్త బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబెర్ బొంబాయి రమేష్ నాయుడు, వైసీపీ సీనియర్ నాయకుడు బాల రమేష్ బాబు, మాజీ జెడ్పిటిసి వెన్నపూస వెంకటరామిరెడ్డి, యాడికి వైసిపి మండల కన్వీనర్ సంజీవరాయుడు, యాడికి మాజీ ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్, బ్రహ్మానందరెడ్డి, వేళ్ళబోయిన వెంకటేష్, పొంతల కిట్ట, ఓగేటి శ్రీరాములు తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైఎస్సార్ జయంతి సందర్భంగా రక్తదానం చేసిన దాసరి నాగార్జున



శింగనమల, జూలై 8 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం, సింగనమల మండలానికి చెందిన దాసరి నాగార్జున మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమం అనంతపురం సర్వజన ఆసుపత్రిలో నిర్వహించబడింది.

డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి పట్ల తనకున్న అభిమానంతో, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని నాగార్జున ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని రక్తదానం చేసి సమాజానికి సేవ చేయాలనే తన సంకల్పాన్ని వెల్లడించారు.

ఈ సందర్భంగా స్థానికులు నాగార్జున సేవాభావాన్ని అభినందించారు

## ఆఖరికి దేవునికే రక్షణ కరువైంది, నేరస్తులదే రాజ్యం



ఉరవకొండ, జులై 8 (అనంత ప్రభ)

ఉరవకొండ నియోజకవర్గం ఉరవకొండ మండలం పెన్నాహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కి కూటమి ప్రభుత్వంలో దేవునికి రక్షణ కరువైందని రెండు సంవత్సరముల కాలంలో దోపిడీలు,దొంగతనాలు, హత్యలు,అత్యాచారాలు, కిడ్నాప్,లాకప్ డెత్ లతో హింస పెట్రేగిపోయి శాంతి భద్రతల సమస్య అడ్డు అదుపు లేకుండా పోయింది. గ్రేటర్ రాయలసీమ అధికార ప్రతినిధి కే.వి. రమణ అన్నారు. టిడిపి ప్రజాప్రతినిధులు ఎవరి ఆదాయ వనరుల అన్వేష–ణలో వాళ్ళు నిమగ్నమైపోయారని

తాజాగా ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిథ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా పేకాట క్లబ్బులు,రైతుల మోటార్ల దొంగతనాలు,సారా బెల్ట్ షాపులు,విరాజిల్లు తున్న నేపథ్యంలో మంగళవారం రోజు ప్రసిద్ధ పెన్నహోబిలం ఆలయంలో భారీ దొంగతనం జరిగింది.మంగళవారం అర్ధరాత్రి దాటాక దుండగులు ఆలయం ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి ఉద్భవ లక్ష్మీ ఆలయంలోకి ప్రవేశించారు.దొంగతనానికి సంబంధిన ఆధారాలు లభించకుండా ఒక ప్లాన్ ప్రకారం ఆలయంలో ఉండే సీసీ కెమెరాలు,డీవీఆర్ బాక్స్ మానిటర్ ను ముందుగానే దొంగతనం చేసి ఆ తర్వాత లక్ష్మీ విగ్రహంపై ఉన్న విలువైన సొమ్ములు దోచుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు.వీటితో పాటు హుండీ సొమ్మును కూడా దోచుకున్నారు.

మామూళ్ల మత్తులో ఉన్న సంబంధిత పోలీసులు దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లు విచారణ ప్రారంభించారని కె.వి రమణ అన్నారు.

కూటమి ప్రభుత్వం ఏ వ్యవస్థ పని ఆ వ్యవస్థను చేయ నీయకపోవడం వల్లనే పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైపోయింది.దాని ఫలితంగానే రాష్ట్రంలో లా ఆర్డర్ అదుపులో లేకుండా పోయిందని ఆయన అన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు వ్యవస్థను గాడిలో పెట్టి,శాంతి భద్రతలను కాపాడాలని లేకుంటే నేరస్తులే రాజ్యమేలుతారని గ్రేటర్ రాయలసీమ అధికార ప్రతినిధి కే విరమణ అన్నారు.


## సాదాపురం బీజేపీకి కొత్త ఊపు--ఇంచార్జిగా మధుసూదన శర్మకు ఘన సన్మానం



ఆదోని, జులై 8 (అనంత ప్రభ)

ఇటీవల సాదాపురం మండల భారతీయ జనతా పార్టీ ఇంచార్జిగా నియమితులైన వెల్లాల మధుసూదన శర్మకు తిరుమలనగర్‌లోని శ్రీనివాస కళ్యాణ మండపంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానం నిర్వహించారు. మండల అధ్యక్షుడు బి. ఉషారాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కోసిగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజేష్‌తో పాటు వివిధ మోర్చాల అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూదన శర్మ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మండల అధ్యక్షుడు ఉషారాజు, ప్రధాన కార్యదర్శి కోసిగయ్యతో కలిసి సాదాపురం మండలంలో పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తామని అన్నారు. రానున్న స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజలకు చేర్చాలని పిలుపునిచ్చారు. పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమానికి హాజరై తనను అభినందించిన నాయకులు, కార్యకర్తలందరికీ మధుసూదన శర్మ కృతజ్ఞతలు తెలిపారు

## పకడ్బందీగా సాగుతున్న సర్ కార్యక్రమం



కూడేరు, జూలై 8 (అనంత ప్రభ)

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కూడేరు మండల వ్యాప్తంగా స్వర్ణ గ్రామ సచివాలయ అధికారులు సర్ కార్యక్రమం చురుగ్గా నిర్వహిస్తామన్నారు. మండల కేంద్రంలోని బి ఎల్ ఓ గా ఉన్న ప్రభుత్వ అధికారులు మరియు అన్ని రాజకీయ పార్టీల సంబంధించిన బి ఎల్ ఏ లు సంబంధిత వార్డుల్లో నిష్పక్షపాతంగా బూతు లెవల్ అధికారులు, మరియు బూత్ లెవెల్ అసిస్టెంట్లు సమన్వయంతో ఓటర్ల జాబితాలోని తప్పుల సవరణలను సరిదిద్దుకుంటూ సర్ కార్యక్రమాన్ని పొగడ్బందీగా నిర్వహిస్తామన్నారు. సమయం తక్కువ ఉన్నందున జూన్ 14 తేదీలోపు ఓటర్లు అంతా ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తిచేసి సంబంధిత బిఎల్ఏ ల ద్వారా బి ఎల్ ఓ లకు సమర్పించాలని వారు కోరారు.

## సింగంపల్లిలో ఘనంగా డాక్టర్ వైఎస్ఆర్ జయంతి



ఆత్మకూరు, జులై 8 (అనంత ప్రభ)

ఆత్మకూరు మండలం పరిధిలోని సింగంపల్లి గ్రామంలో బుధవారం రోజున ప్రియతమ నేత స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి కార్యక్రమాన్ని వైయస్ఆర్సీపీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నేతలు, కార్యకర్తలు, మహిళా, వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులు అనుబంధ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 24 గంటల్లోనే తప్పిపోయిన బాలుడి ఆచూకీ గుర్తించిన పెద్దతుంబలం పోలీసులు



ఆదోని, జులై 8 (అనంత ప్రభ)

ఆదోని మండలం పెద్దతుంబలం పోలీస్ స్టేషన్ పరిధిలో తప్పిపోయిన దాదావలి (17) అనే బాలుడిని పెద్దతుంబలం పోలీసులు కేవలం 24 గంటల్లోనే గుర్తించి సురక్షితంగా అతని తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల వేగవంతమైన చర్యలతో బాలుడు క్షేమంగా కుటుంబ సభ్యులను చేరుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై విద్యశ్రీ మాట్లాడుతూ, పిల్లలు లేదా ఇతర వ్యక్తులు ఎవరైనా కనిపించకుండా పోయిన వెంటనే ఆలస్యం చేయకుండా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. ఫిర్యాదు ఎంత త్వరగా అందితే అంత వేగంగా గాలింపు చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే సీసీటీవీ 360 యాప్ సహాయంతో తప్పిపోయిన వారి ఆచూకీని త్వరగా గుర్తించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరిస్తూ ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా వెంటనే సమాచారం అందించాలని కోరారు. 24 గంటల్లోనే బాలుడిని గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించిన పెద్దతుంబలం పోలీసుల చాకచక్యాన్ని స్థానిక ప్రజలు అభినందించారు

## ఎస్ఐఆర్ దరఖాస్తులు గడువులోగా సమర్పించండి



ఆదోని, జులై 8 (అనంత ప్రభ)

ఆదోని మండలం పెద్దతుంబలం గ్రామ ప్రజలకు ఎస్ఐఆర్ దరఖాస్తులపై గ్రామ ప్రతినిధులు అవగాహన కల్పించారు. ఎస్ఐఆర్ ఫారం తీసుకున్న ప్రతి ఒక్కరూ తమ ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, ఒక పాస్‌పోర్టు సైజు ఫొటోతో పాటు తల్లిదండ్రులలో ఎవరో ఒకరి ఓటరు గుర్తింపు కార్డును జత చేసి గ్రామ సచివాలయంలోని బూత్ స్థాయి అధికారులకు తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. దరఖాస్తులు సమర్పించడానికి ఇంకా నాలుగు రోజుల గడువు మాత్రమే ఉన్నందున గ్రామ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా అవసరమైన పత్రాలను సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ కొండాపురం నర్సిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు సరోజ, అనంతలక్ష్మి, కృష్ణవేణి, మీనాకుమారి, సుభద్రదేవి, ఊర్మిళ, సౌమ్య, బూత్ స్థాయి అధికారులు, పొదుపు సంఘాల పుస్తక నిర్వహకులు రాజేశ్వరి, నాగలక్ష్మి, తిమ్మప్ప, అలాగే భారతీయ జనతా పార్టీ, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొని గ్రామ ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించారు.